# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 66 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 4-6 -2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు

- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




## రేపు తెలంగాణ కేబినేట్ భేటీ

- పలు కీలక అంశాల పై చర్చించే అవకాశం
- ఉద్యోగుల సమస్యలపై కీలక నిర్ణయం
- సచివాలయంలో మధ్యాహ్నం మూడు గంటలకు స్టార్ట్

**హైదరాబాద్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ ప్రభుత్వం కీలక అభివృద్ధి, పరిపాలనా అంశాలపై చర్చించేందుకు జూన్ 5న కేబినెట్ సమావేశం నిర్వహించనుంది. మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ఈ సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం కీలక నిర్ణయాలకు వేదిక కానుంది. ఈ సమావేశంలో పలు ముఖ్య అంశాలపై చర్చ -మిగతా 2 లో



### రాగల రెండురోజులు
## తేలికపాటి వర్షాలు

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్ జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణలో రాగల రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, -మిగతా 2 లో



## వర్షాకాల సన్నద్ధతపై సీఎం రేవంత్ సమీక్ష

- 24 గంటలు అందుబాటులో మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్
- వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ముందస్తు చర్యలు

**హైదరాబాద్,జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అనుకున్న సమయానికంటే మందే నైరుతి రుతు పవనాలు తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురవనున్నాయంటూ ఇప్పటికే వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంగళవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే గుర్తించిన 141 వాటర్ లాగింగ్ పాయింట్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ పనుల్లో పురోగతిపై ఉన్నతాధికారులను సీఎం -మిగతా 2 లో



## రైతులకు రక్షణగా భూభారతి చట్టం

### రైతులను దగా చేసిన ధరణి పోర్టల్

- నేటి నుంచి ఈ నెల 20 వరకు అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు
- భూ భారతి చట్టం చరిత్రాత్మకం
- అత్యంత పారదర్శకంగా భూభారతి
- కొత్త చట్టాలపై అవగాహన సదస్సులో భట్టి




**ఖమ్మం,**

రైతులకు ఎంతో ఉపయోగపడేలా 'భూభారతి' చట్టాన్ని జాగ్రత్తగా రూపకల్పన చేశామని తెలంగాణ డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ రైతులకు మేలు చేసేలా చట్టాలురూపొందించిందని, గత బిఆర్ఎస్ మాత్రం రైతులను దగ చేసే చట్టాలను తెచ్చిందన్నారు. అందుకు ధరణి పోర్టలే నిదర్శనమన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల -మిగతా 2 లో



## నేడు జాగృతి మహాధర్నా

- కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు నిరసనగా ధర్నా

**హైదరాబాద్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ నోటీసులు ఇచ్చినందుకు నిరసనగా తెలంగాణ జాగృతి భారీ ధర్నాకు పిలుపునిచ్చింది. జూన్ 4న బుధవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ మహాధర్నా ఇందిరా పార్క్ వద్ద జరగనుంది. ఈ ధర్నాను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ -మిగతా 2 లో

## బనకచర్ల ప్రాజెక్ట్ మాకు సమ్మతం కాదు



- దీనిపై ఇప్పటికే కేంద్రానికి ఫిర్యాదు చేశాం
- తెలంగాణ ప్రయోజనాలకు ఇది వ్యతిరేకం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి


**హైదరాబాద్,జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్ట్‌ను వ్యతిరేకిస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అందులోభాగంగా ఈ ప్రాజెక్ట్‌ను అడ్డుకునేందుకు తాము ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని అన్నారు. తెలంగాణ ప్రయోజనాలకు ఇది భంగం కలిగిస్తుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ఇప్పటికే కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకు వెళ్లి.. -మిగతా 3 లో

### అమెరికాలో ఇబ్బంది
## పడితే చెప్పండి

### వారికి బీఆర్‌ఎస్ అండగా నిలుస్తుంది

- అవసరమైన పక్షంలో న్యాయసహాయం కూడా అందిస్తాం
- అమెరికా చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిందే
- మంచి మార్పు దిశగా విద్యార్థులు కృషి చేయాలి
- డల్లాస్ పర్యటనలో విద్యార్థులతో కేటీఆర్




**హైదరాబాద్‌జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

అమెరికాలో వివిధ కారణాలతో ఇబ్బందులు పడే భారతీయ విద్యార్థులకు అండగా నిలబడతామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నో ఆశలతో ఉన్నత విద్య కోసం వచ్చిన విద్యార్థులు, అవగాహన లేక ఏమైనా తప్పు చేస్తే వారికి అవసరమైన న్యాయసహాయం అందించేందుకు బీఆర్‌ఎస్ అమెరికా విభాగం తరపున ప్రయత్నం చేస్తామని తెలిపారు. -మిగతా 2 లో


## నటుడు కమలహాసన్ పై హైకోర్టు ఆగ్రహం

- మీరేమైనా చరిత్రకారులు అనుకుంటున్నారా?
- ప్రజల మనోభావాలు దెబ్బతీసే హక్కు మీకెక్కడిది
- క్షమాపణలు చెప్పలేని వారు..చిత్రం ఆపొద్దని అగడమేంటి?



**బెంగళూరు,జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

క్షమాపణలు చెబితే సమస్య సమసిపోయే దానికి ఎందుకీ పట్టుదల అంటూ నటుడు కమలహాసన్‌పై కర్నాటక హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. క్షమాపణలు చెప్పనప్పుడు వ్యాఖ్యలు ఎందుకు చేయాలని కూడా ప్రశ్నించింది. ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి మీరేమైనా చరిత్రకారులా అని నిలదీసింది. 'థగ్ లైఫ్' విడుదలను నిషేధించాలని కోరుతూ కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కేఎఫ్‌సీసీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, మంగళవారం దీన్ని విచారించిన హైకోర్టు కమల్ హాసన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంత పెద్ద -మిగతా 2 లో



## లష్కరే ముసుగుకు చైనా రక్షణ

- చైనా అండతోనే టిఆర్ఎఫ్ పేరు తప్పింపు
- అఖిలపక్ష దౌత్య బృందం సభ్యుడు శశిథరూర్

**న్యూఢిల్లీ,**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి వెనుక ఉన్న లష్కరే తొయిబా ముసుగు సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ను చైనా కాపాడుతోందని అఖిలపక్ష దౌత్య బృందం సభ్యుడు శశిథరూర్ మండిపడ్డారు. పాకిస్థాన్ ప్రభుత్వం చైనా అండతో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి లోనూ, ప్రెస్‌నోట్‌లోను -మిగతా 2 లో

# రైతులకు రక్షణగా భూభారతి చట్టం

(మొదటి పేజి తరువాయి)

నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం జూన్ 2 రోజున భూ భారతి చట్టం అమల్లోకి వచ్చింది. భూ సమస్యలను లేకుండా చేసేందుకు రేవంత్ సర్కార్ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా నేటి నుంచి ఈ నెల 20 వరకు అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భూ భారతి చట్టం చరిత్రాత్మకం అని అన్నారు. భూ సంస్కరణలు తెచ్చింది మొదట కాంగ్రెస్ పార్టీనే అని గుర్తు చేశారు. మొదటి చట్టం కాంగ్రెస్ దే.. రెండో చట్టం కూడా కాంగ్రెస్ పార్టీ చేసిందేనని స్పష్టం చేశారు. భూ సంస్కరణల చట్టం కూడా కాంగ్రెస్ తీసుకుని వచ్చిందని తెలిపారు. 2020 లో బీఆర్ఎస్ ధరణి చట్టాన్ని తీసుకొచ్చింది. ధరణి చట్టంతోనే సమస్యలు వచ్చాయన్నారు. కాంగ్రెస్ చట్టాలు రైతులకు మేలు చేస్తే.. బీఆర్ఎస్ చట్టాలు ప్రజలకు ఇక్కట్లను తెచ్చాయన్నారు. ధరణిలో కరెక్షన్ చేయడానికి కూడా అవకాశం లేకుండా చట్టం చేశారన్నారు. ధరణికి తాళం వేసుకుని కూర్చున్నారు..భూములు కబ్జా చేసి అక్రమాలకు పాల్పడి వాటిని మార్చకుండా చేసేందుకు ధరణికి తాళం వేసేశారు ఆనాటి పెద్దలు అని మండిపడ్డారు. అనాడు బూర్గుల రామకృష్ణ రావు గురించి ఎలా చెబుతామో నేడు పొంగులేటి గురించి కూడా అలా చెప్పుకోవాల్సి ఉంటుంది. గతంలో భూమికి పన్ను కట్టేవాళ్ళము. నేడు అది లేకుండా పోయింది. గతంలో జమాబంది వుండడం ద్వారా వివాదాలకు ఆస్కారం లేకుండా పోయింది. అసైన్ మెంట్ కమిటీలు లేకపోవడం వల్ల నష్టం కూడా జరిగిందని వెల్లడించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి వల్ల భూసమస్యలు పరిష్కారం కాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతిని తీసుకొచ్చింది. భూ సమస్యలు లేని తెలంగాణ కోస ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుల భూ సమస్యలు తీర్చాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి ఆర్వోఆర్ యాక్ట్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. నేటి నుంచి ఈ నెల 20 వరకు అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించదని భట్టి అన్నారు. భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేసింది. మానవీయ కోణంలో భూసమస్యలను పరిష్కరించాలని కోరింది. ప్రజల వద్దకే రెవెన్యూ అనే నినాదంతో అన్నీ రెవెన్యూ గ్రామాలకు తహశీల్దార్ తో కూడిన బృందం వెళ్లనుంది. ఆయా గ్రామాల్లో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించ నున్నారు. మండలాల వారిగా రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ ని ప్రకటించి ఏ రోజున ఏ గ్రామంలో సదస్సు జరుగుతుందనేది ప్రజలకు తెలిసేలా ప్రచారం చేస్తున్నారు. భూ భారతి చట్టం ద్వారా ధరణిలో పరిష్కారం కాని సాదా బైనామా, మిస్సింగ్ సర్వే నంబర్, రైతు వివరాలల్లో తప్పులు, డిజిటల్ సిగ్నిచర్ పెండింగ్, అసైన్డ్ టు పట్టా క్లాసిఫికేషన్, ప్రోహిబిటెడ్ జాబితా మార్పు, సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్, భూసేకరణ సమస్యలు, ఫారెస్ట్, ఇరిగేషన్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్ల మధ్య డిస్ప్యూట్ ఉన్న భూముల మార్పు, తదితర అంశాల కోసం భూ భారతి ఆర్వోఆర్ చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని వివరించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మనుషులకు ఆధార్ లాగే భూములకు త్వరలో భూధార్‌ను తీసుకొస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భూభారతి చట్టం తెచ్చామన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించి భూములను సర్వే చేయిస్తామని తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 3,500 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని పొంగులేటి చెప్పారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విప్లవాత్మక చట్టాన్ని తమ ప్రభుత్వం తెచ్చిందన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా.. భూముల సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. భూభారతితో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

# అమెరికాలో ఇబ్బంది పడితే చెప్పండి

(మొదటి పేజి తరువాయి)

అమెరికా వచ్చిన విద్యార్థులు ఏదైనా కారణంతో తిరిగి వస్తే అతనితోపాటు వారి కుటుంబం ఎంతో ఆవేదనకు గురవుతుంద న్నారు చెప్పారు. అందుకే విద్యార్థులకు అండగా నిలబడేందుకు నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. అయితే విద్యార్థులు కూడా అమెరికా చట్టాలను, అక్కడి సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకొని మసులుకోవాలని సూచించారు. స్థానిక చట్టాలతో పాటు- ఇక్కడి పరిస్థితులను ప్రతీ ఒక్క విద్యార్థి అవగాహన చేసుకోవాలన్నారు. అమెరికాలోని డాలస్ పర్యటనలో ఉన్న కేటీఆర్.. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డల్లాస్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో మాట్లాడారు. వర్సిటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా సమాజంలో, ప్రపంచంలో మంచి మార్పు తీసుకువచ్చే దిశగా ప్రయత్నం చేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రపంచవ్యాప్తంగా గొప్ప ఆవిష్కరణలు వస్తున్నాయన్న కేటీఆర్, ఇన్నోవేషన్ రంగంలో ప్రపంచ దేశాలతో భారత్ పోటీపడి రాణించాల్సిన అవసరం ఉందన్నారు. అమెరికాలోని ఉన్నత విద్యా సంస్థల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. రిస్కు తీసుకున్నప్పుడు మాత్రమే కలలు సాకారం అవుతాయి అనడానికి కేసీఆర్ జీవితమే సాక్ష్యమని చెప్పారు. అమెరికా పోవాలన్నా, చదువు కోవాలన్నా ఎన్నో వ్యయ ప్రయాసలకు గురయ్యే వాళ్లమన్న కేటీఆర్.. ప్రపంచం వేగంగా మారిపోయి ఇప్పుడు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. దాంతోపాటే అమెరికా విద్య కూడా అనేక మందికి అందుబాటులోకి వచ్చిందన్నారు. కేవలం ర్యాంకుల కోసమో, గ్రేడ్ల కోసమో కాకుండా జీవితంలో సాధించాల్సిన ప్రధాన లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. చూస్తుండగానే మనిషి జీవితంలో 50 ఏండ్లు పూర్తవుతాయని ఇంత స్వల్ప కాలంలోనే తమ కలలు, ఆకాంక్షలను అందిపుచ్చుకోవాలన్నారు. లక్ష్యం వైపు సాగే క్రమంలో అవరోధాలు ఎదురైనా, మనతోనే ఉన్న వ్యక్తులు వెనక్కి లాగినా నిబద్ధతతో ముందుకు పోవాలని చెప్పారు. రాజకీయాల్లో చిన్న వయసుగా పరిగణించే నాలుగు పదుల వయసులో పదవులను త్యాగం చేశారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు- కోసం ఉద్యమం మొదలుపెట్టిన రోజు అనేకమంది ఆయనను అవహేళన చేశారని తెలిపారు. కానీ 14 సంవత్సరాల నిరంతర పోరాటం తర్వాత ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నప్పుడు సమాజంలోని ప్రతి ఒక్కరు కేసీఆర్‌పై ప్రశంసల కురిపించారని చెప్పారు. అమెరికాలో చదువుకుని ఇండియాకి తిరిగి వచ్చి కంపెనీలు ప్రారంభించాలని విద్యార్థులను కోరారు. మనదేశంలో ఎన్నో సవాళ్లు ఉన్నప్పటికీ అనేక అవకాశాలు కూడా ఉన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. మేథోవలస (ఇసశ ఉసశ) మన దేశానికి పెను సవాలుగా మారిందని చెప్పారు. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో విదేశాల్లో చదువుకుంటున్న యువత భాగం కావాలని పిలుపునిచ్చారు. ఇకపోతే అక్కడ తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. దీనిలో భాగంగా డాలస్‌లో అమెరికాలోనే అతి పెద్దదైన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సందర్శించారు. అక్కడ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహమే ఆయుధాలుగా భారతీయులందరినీ గాంధీ సమాయత్తం చేశారన్నారు. బ్రిటిష్ బానిస సంకెళ్ల నుంచి దేశాన్ని విడిపించి స్వాతంత్య్రం తీసుకొచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. అందుకే ప్రపంచ వ్యాప్తంగా నేటికీ గాంధీని ప్రశంసిస్తూనే ఉంటారని చెప్పారు. అలాంటి విశ్వనాయకుడి విగ్రహాన్ని ఇంత పెద్ద ఎత్తున డాలస్‌లో నెలకొల్పడంలో మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.ప్రసాద్ తోటకూర, కార్యవర్గ సభ్యుల కృషిని కేటీఆర్ అభినందించారు. అనంతరం ఆ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి రావు కల్వాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు, దశాబ్దకాలం పాటు రాష్ట్ర అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, వారి కుటుంబసభ్యులు చేసిన కృషి, త్యాగాలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువలేరని చెప్పారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం కేసీఆర్ మార్గనిర్దేశరలో కేటీఆర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ విజన్ తెలంగాణకు ఒక గళాన్ని ఇచ్చిందన్నారు. డా.ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ అమెరికాలో అతి పెద్దదైన గాంధీ స్మారకస్థలిని నిర్మించి 10 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ నిర్మాణం ప్రవాస భారతీయుల సమష్టి కృషి, ఐకమత్యానికి నిదర్శనమని చెప్పారు. దీన్ని సాకారం చేసేందుకు అనుమతులు ఇచ్చిన నగర అధికారులు, దాతలు, కార్యవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా డాలస్ సందర్శనకు వచ్చినవారు ఈ గాంధీ స్మారకస్థలిని సందర్శిస్తూనే ఉన్నారని చెప్పారు.

## బనకచర్ల ప్రాజెక్ట్ మాకు సమ్మతంకాదు

(మొదటి పేజి తరువాయి)

మాట్లాడామన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మించ కుండా అడ్డుకోవాలని ఆయన్ని కోరామని చెప్పారు. అలాగే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అభ్యంతరాలపై ఇప్పటికే కేంద్రానికి తెలియజేశామన్నారు. ఆ క్రమంలో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కేంద్ర జల్‌శక్తి మంత్రికి లేఖలు రాసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి ఇంకా ఎలాంటి ప్రయత్నాలు చేయాలో అవన్నీ చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గోదావరి నదికి వరద పోటెత్తే క్రమంలో నీరు సముద్రం పాలవుతుంది. ఈ నేపథ్యంలో ఆ నీటిని ప్రజా ప్రయోజనాల కోసం మళ్లించాలని ఏపీలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందులోభాగంగా బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం ద్వారా ఆ వరద నీటిని రాయలసీమతోపాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు మళ్లించాలని భావించింది. తద్వారా తాగు, సాగు నీటి అవసరాలు తీర్చవచ్చని చెప్పింది. ఆ క్రమంలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై కేంద్రంతో ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడు చర్చించారు. అలాగే ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల కలిగే లాభాలను సైతం కేంద్రానికి లేఖ ద్వారా సీఎం చంద్రబాబు వివరించారు. ఈ నేపథ్యంలో జూన్ 2వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శితోపాటు- ఆ శాఖ ఉన్నతాధికారులతో ఏపీ జలవనరులు శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీ ప్రభుత్వ నీటి సలహాదారు వెంకటేశ్వరరావు సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం గురించి కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శికి ఏపీ అధికారులు సోదాహరణగా వివరించారు. ఈ సందర్భంగా ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు ఏమైనా నష్టం జరిగే అవకాశముందా అనే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు.. ఏపీ అధికారులను ప్రశ్నించగా.. వాటికి సైతం రాష్ట్ర అధికారులు స్పష్టమైన వివరణ ఇచ్చినట్లు- తెలుస్తుంది. ఈ బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఏపీ ప్రభుత్వం రూ. 81 వేల కోట్లతో నిర్మించ తలపెట్టిన సంగతి తెలిసిందే. మరోవైపు బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణంపై ఇప్పటికే బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ కె. కవిత అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌ను ఏపీ నిర్మిస్తుందని ఆమె ఇటీవల మీడియాలో మాట్లాడుతూ గుర్తు చేశారు.

## నటుడు కమలహాసన్ పై హైకోర్టు ఆగ్రహం

(మొదటి పేజి తరువాయి)

నటుడైనప్పటికీ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఆయనకు లేదని హెచ్చరించింది. ఈ అంశంపై తీవ్రంగా స్పందించింది. అతడి వ్యాఖ్యలకు ఆధారాలను అడిగింది. 'ఒక్క క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని' వ్యాఖ్యానించింది. మీరు కమల్‌హాసన్ కావచ్చు లేదా మరెవరైనా కావచ్చు. ప్రజల మనోభావాలను దెబ్బతీయలేరు. ఒక ప్రజాప్రతినిధిగా అలాంటి ప్రకటన చేయకూడదు. మీ కామెంట్స్ వల్ల అశాంతి ఏర్పడింది. కన్నడ ప్రజలు మిమ్మల్ని క్షమాపణలు మాత్రమే అడిగారు. మీరు ఏ ప్రాతిపదికన ఆ ప్రకటన చేశారు? మీరు ఏమైనా చరిత్రకారులా? లేక భాషావేత్తనా? ఎందుకు అలాంటి వ్యాఖ్యలు చేశారని కమల్‌హాసన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. క్షమాపణ చెప్పే ఉద్దేశం లేకపోతే, కర్ణాటకలో సినిమా విడుదల ఎందుకని ప్రశ్నించింది. క్షమాపణ చెప్పని పక్షంలో కర్ణాటకలో సినిమాను ఎందుకు ప్రదర్శించాలనుకుంటున్నారు? వదిలేసేయండి. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ హద్దులు దాటి, ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు కదా. మీరు క్షమాపణ చెబితే ఏ సమస్యా ఉండదు. మీ సినిమాను ప్రదర్శించటం ద్వారా కర్ణాటక నుంచి కూడా మీరు రూ.కోట్లలో ఆదాయాన్ని పొందవచ్చని కోర్టు పేర్కొంది. కమల్‌హాసన్ ఉద్దేశ పూర్వకంగా ఆ వ్యాఖ్యలు చేయలేదని ఆయన తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకురాగా, 'పరిస్థితుల కారణంగా బాధితుడయ్యే వ్యక్తికీ, వాటిని సృష్టించే వ్యక్తికీ మధ్య చాలా తేడా ఉంది. ఇప్పటికే కమల్‌హాసన్ బాహాటంగా తన అభిప్రాయాన్ని ప్రకటించారు. దాన్ని మీరు ఇప్పుడు కప్పిపుచ్చలేరు. మిగిలింది క్షమాపణలు చెప్పడమే' అని కోర్టు వ్యాఖ్యానించగా, కమల్‌హాసన్ పరిస్థితిని చక్కబరిచేందుకే ప్రయత్నించినా, అది పక్కదారి పట్టిందని ఆయన తరఫు న్యాయవాది అన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ 'కావచ్చు. కానీ, కారణం ఎవరు? మీరే పరిస్థితి చేయిదాటిపోయేలా చేశారు.

# రేపు తెలంగాణ కేబినేట్ భేటీ

(మొదటి పేజి తరువాయి)

జరగనుంది. ముఖ్యంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఇచ్చిన నివేదికపై ఈ సమావేశంలో విశ్లేషణ జరగనుంది. పాత పింఛన్ విధానం, ప్రమోషన్లు, బదిలీలు, ఖాళీల భర్తీ తదితర అంశాలపై తీసుకునే నిర్ణయాల కోసం ఇది కీలకంగా మారింది. వివాదాస్పదంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇటీవల నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, విజిలెన్స్ విభాగాలు సమర్పించిన నివేదికలపై కేబినెట్‌లో చర్చించనున్నారు. లోపాల పరిశీలన, బాధ్యుల నిర్ధారణ, తదుపరి చర్యలపై మంత్రివర్గం నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. యువత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకం అమలు అంశంపై కూడ కేబినెట్ చర్చించనుంది. ఇందులో భాగంగా యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు, స్కిల్లింగ్ కేంద్రాల ఏర్పాటు- వంటి అంశాలు చర్చకు రానున్నాయి. ఈ సమావేశం ద్వారా రాష్ట్ర పరిపాలనలో కీలక మలుపులు వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో సానుకూల నిర్ణయాలు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

### రాగల రెండురోజులు

# తేలికపాటి వర్షాలు

(మొదటి పేజి తరువాయి)

నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని.. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. బుధవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కొనసాగే అవకాశాలున్నాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో జనగామ, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, వికారాబాద్‌తో పాటు- పలు జిల్లాల్లో తేలికపాలి వర్షాలు కురిశాయి. అత్యధికంగా జనగామ జిల్లా వడ్లకొండలో 1.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# నేడు జాగృతి మహాధర్నా

(మొదటి పేజి తరువాయి)

కల్వకుంట్ల కవిత స్వయంగా నేతృత్వం వహించనున్నారు. కేంద్ర సంస్థలు కేసీఆర్‌పై టార్గెట్ చేసినట్లు ఆరోపిస్తూ, ఇది రాజకీయ కుట్రగా అభివర్ణిస్తూ జాగృతి నిరసన కార్యక్రమాన్ని చేపట్టనుంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంబంధించి కేసీఆర్‌కు నోటీసులు రావడం, దానిపై తెలంగాణ భవనుల నుండి కార్యకర్తల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ మహాధర్నా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ మాజీ సీఎం ప్రతిష్టను దెబ్బతీయాలని జరుగుతున్న చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జాగృతి ఈ నిరసన చేపడుతోందని కవిత పేర్కొన్నారు. ఈ మహాధర్నాలో జాగృతి కార్యకర్తలు, తెలంగాణ సంస్కృతి సంఘాల ప్రతినిధులు, నాయకులు భారీగా పాల్గొనే అవకాశం ఉంది. అధికార సంస్థల నిర్ణయాలను ప్రశ్నించే స్థాయిలో ఇది కీలక కార్యక్రమంగా మారనుంది.

# వర్షాకాల సన్నద్ధతపై సీఎం రేవంత్ సమీక్ష

(మొదటి పేజి తరువాయి)

రేవంత్ రెడ్డి ఆరా తీశారు. హార్వెస్టింగ్ వెల్స్‌లోకి చేరే వర్షపు నీటిని ఆటోమేటిక్ పంపుల ద్వారా బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలంటూ ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు, వరదలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి మానిటరింగ్ చేసేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు- చేసుకోవాలని అధికారులకు సూచించారు. వర్షాలు పడినప్పుడు హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్‌ఎంసీ విభాగాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నాలుగు విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అసంపూర్తిగా ఉన్న నాలాల పూడికతీత పనులు వీలైనంతగా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆయన కోరారు. ఇక సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలనున్న కోర్ అర్బన్ రీజియన్‌లో సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని చెరువులు, నాలాలు, రోడ్ల విస్తరణ, అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక పాలసీని తయారు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ అధికారులు శేషాద్రి, మాణిక్ రాజ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, హెచ్‌ఎండీఏ అధికారులతో పాటు ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# లష్కరే ముసుగుకు చైనా రక్షణ

(మొదటి పేజి తరువాయి)

టీఆర్ఎఫ్ పేరును తప్పించిందని అన్నారు. బ్రెజిల్ దౌత్యవేత్త, బ్రెజిల్ అధ్యక్షుడు ప్రధాన సలహాదారులు సెల్సో అమోరిమ్‌తో జరిపిన సమావేశంలో థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. యూఎన్ ఆంక్షల కమిటీ-కి టీ-ఆర్ఎఫ్‌కు సంబంధించిన సాక్ష్యాలను పలుమార్లు సమర్పించామని, ప్రతి సందర్భంలోనూ తన మిత్రదేశం పాకిస్థాన్‌కు అండగా నిలుస్తూ టీ-ఆర్ఎఫ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అడ్డుకుంటోందని శశిథరూర్ వివరించారు. లష్కరే తొయిబా ఏర్పాటు- చేసిన టీఆర్ఎఫ్ పహల్గాం ఉగ్రదాడి జరిగిన మరుసటి రోజే దాడికి తామే బాధ్యులమని ప్రకటించిందని, అయితే ఇందువల్ల తలెత్తే పరిణామాల గుర్తించి పాక్‌లోని సోషల్ మీడియా హ్యాండిలర్స్ దానిని డిలీట్ చేశారని చెప్పారు. యూఎన్ఎస్‌సీ ప్రెస్‌మీట్‌లోనూ టీ-ఆర్ఎఫ్ ప్రస్తావన చేర్చాలని ఇండియా పదేపదే కోరినప్పటికీ పాకిస్థాన్ ప్రభుత్వం చైనాలోని తమ మిత్రుల అండతో ఆ పేరును తప్పించిందని, కనీసం దాని ప్రస్తావన కూడా లేదని వివరించారు.

## 2025 జూన్ 4, బుధవారం తెలుగు పంచాంగం




**మాసం -పక్షం**
మాసం: జ్యేష్ఠమాసం (అమాంత)
పక్షం: శుక్లపక్షం
**తిథి**
నవమి: జూన్ 3, రాత్రి 9:56 నుండి జూన్ 4, రాత్రి 11:54 వరకు
దశమి: జూన్ 4, రాత్రి 11:54 నుండి జూన్ 6, తెల్లవారుజామున 2:16 వరకు
**నక్షత్రం**
ఉత్తరఫాల్గుణి: జూన్ 4, తెల్లవారుజామున 12:58 నుండి జూన్ 5, తెల్లవారుజామున 3:35 వరకు
**సూర్యోదయం - సూర్యాస్తమయం**
సూర్యోదయం: ఉదయం 5:44
సూర్యాస్తమయం: సాయంత్రం 6:44
**చంద్రోదయం - చంద్రాస్తమయం**
చంద్రోదయం: మధ్యాహ్నం 12:12
చంద్రాస్తమయం: రాత్రి 1:19
**శుభ సమయాలు**
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:08 నుండి 4:56 వరకు
అమృతకాలం: సాయంత్రం 7:35 నుండి రాత్రి 9:22 వరకు
**అశుభ సమయాలు**
రాహుకాలం: మధ్యాహ్నం 12:14 నుండి 1:51 వరకు
యమగండం: ఉదయం 7:22 నుండి 8:59 వరకు
గులిక కాలం: ఉదయం 10:37 నుండి మధ్యాహ్నం 12:14 వరకు
దుర్ముహూర్తం: మధ్యాహ్నం 11:48 నుండి 12:40 వరకు
వర్జ్యం: ఉదయం 8:57 నుండి 10:43 వరకు

# రైతు వేదికలో క్వాలిటీ సీడ్ పంపిణీ



**మాడుగుల, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మాడుగుల మండలంలోని రైతు వేదిక లో క్వాలిటీ సీడ్ ఇన్ ఎవరీ విలేజ్ (క్యూఎస్ఈవి) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ సమీర్ ఆధ్వర్యంలో వరిలో మూల విత్తనాన్ని శాస్త్రీయ పద్ధతిలో రైతులకు అందించారు.

ఈ కార్యక్రమం ద్వారా

- ప్రాంతంలోని వరి సాగు రైతులను ఎంపిక చేసి,నాణ్యమైన మూల విత్తనాన్ని శాస్త్రవేత్తల మానిటరింగ్ లో అందజేశారు.
- సస్యరక్షణ చర్యలు, పంట సంరక్షణ, అధిక దిగుబడికి అవసరమైన మెలకువలు రైతులకు వివరించారు.
- ప్రమాణిత సాగు విధానాలను పాటిస్తూ,విత్తనాన్ని యాజమాన్య పద్ధతుల్లో ఉత్పత్తి చేసి,గ్రామ రైతులకు పంపిణీ చేసే ప్రణాళిక రూపొందించారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అరుణ కుమారి,విస్తరణ అధికారులు ప్రసన్న, జ్యోత్స్న, రాజేష్ నాయక్, ప్రియాంక, నవ్య, భార్గవి మరియు రైతులు సత్తయ్య, వంగూరు గోవర్ధన్ రెడ్డి, ఆమనగంటి పర్వత రెడ్డి, యాదయ్య, డేరంగుల దేవేందర్, దేవరకొండ శ్రీనివాస్, ప్రవీణ్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ వ్యవసాయానికి మేలుజేయాలన్న దిశగా తీసుకున్న ఈ చర్య రైతుల అభివృద్ధికి కీలక మలుపుగా నిలుస్తుందని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. నాణ్యమైన విత్తనాన్ని అందించడం ద్వారా వరి దిగుబడి పెరిగి రైతులకు లాభదాయకంగా మారుతుందని వారు తెలిపారు.

# అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ హాస్టల్ లపై చర్యలు తీసుకోవాలి

**-సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్**



**హైదరాబాద్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ప్రయివేట్ హాస్టల్స్ పై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. హైదరాబాద్ లో సుమారుగా 1500 నుంచి 1600 వరకు ప్రయివేట్ హాస్టల్స్ ఉన్నాయని, ఇందులో కొన్ని హాస్టల్స్ కు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు పొందారనేది స్పష్టత లేదన్నారు. ఈ హాస్టల్స్ పై జిల్లా అదనపు కలెక్టర్ కు మరియు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కానీ అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. హాస్టల్ విద్యార్థులకు అందిస్తున్న ఆహారంపై ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ ఉందా అని ప్రశ్నించారు. హాస్టల్లోని విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాల నిఘా, రాత్రి వేలల్లో విషసర్పాలు రాకుండా నిర్వాహకులు తీసుకుంటున్న చర్యలు ఏమిటనేది స్పష్టత లేదన్నారు. జిహెచ్ఎంసి మరియు మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా, రెసిడెన్సియల్ భవనాల్లో వ్యాపారం చేస్తూ టాక్సీలు చెల్లించకుండా, ప్రజా అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ సిలిండర్లను హాస్టల్స్ లో వినియోగిస్తూ, రెసిడెన్షియల్ విద్యుత్ బిల్లులు చెల్లిస్తూ కమర్షియల్ వ్యాపారం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అధికారులు హాస్టల్ నిర్వహిస్తున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ బీజేపీ నేతలు



**విజయవాడ, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ని తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి,బీజేపీ సినీయర్ నాయకులు బోజిరెడ్డి,ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పురుషోత్తం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో ఆరోగ్య రంగంలో సంస్కరణలు, వైద్య సేవల సమగ్రత,ప్రజలకు మెరుగైన ఆరోగ్య సదుపాయాల అందుబాటు వంటి కీలక అంశాలపై చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్రాల మధ్య ఆరోగ్య రంగంలో సమన్వయం,సీజనల్ వ్యాధుల నియంత్రణ,ప్రభుత్వ ఆసుపత్రుల మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి విషయాలను బీజేపీ నాయకులు మంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. సమావేశంలో ప్రముఖ రాజకీయ నేతలు పాల్గొనడం,ఆరోగ్య రంగంలో సహకారంపై చర్చ జరగడం వంటివి ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య వైద్య రంగ సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఈ భేటీ కీలకంగా నిలుస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి భూభారతి

**– కప్పాటి పాండురంగా రెడ్డి**



**మహేశ్వరం,జూన్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కొత్త రెవెన్యూ చట్టం భూభారతి అమలులో భాగంగా నేటి నుంచి రాష్ట్రమంతటా రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుంది. భూభారతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సదస్సులకు శ్రీకారం... నేటి నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల వద్దకే రెవెన్యూ నినాదంతో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో భాగంగా మహేశ్వరం నియోజకవర్గం బాచుపల్లి , దెబ్బడగూడలో కందుకూరు రెవెన్యూ డివిజన్ అధికారి జగదీశ్వర్ రెడ్డి,కందుకూరు మండల తహసీల్దారు గోపాల్ తో యం.యం.సి చైర్మన్, మాజీ జడ్పిటీసిలు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి,అందుగుల సత్యనారాయణతో పాటు కలసి పాల్గొన్న రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి పాల్గొన్నారు. ఈ సంధ్భంగా రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి కీలకంగా మారుతోందని అన్నారు. బిఅర్ స్ పాలనలో భూకబ్జాలు వంటివి పెరిగి భూ సమస్యలతో రైతులు అవస్థలు పడ్డారని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని బిఆర్ఎస్ ప్రభుత్వం తీసికు వచ్చిన ధరణి కారణంగా చాలా విషయాల్లో భూసమస్యలు అధికమై భూవివాదాలతో కొట్టుకుని చావాల్సిన పరిస్థితులేర్పడ్డాయి. ధరణిలో తలెత్తిన సమస్యలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన ప్రభుత్వం సమస్యలు లేకుండా రికార్డులన్నీ సరళతరం చేసే లక్ష్యంతో ధరణి పోర్టల్ లో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు, ధరణీ స్థానంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను తీసుకొచ్చింది అని అన్నారు. తీసుకొచ్చిన భూభారతి ద్వారా భూముల పాలనను మరింత పారదర్శకత కోసం భూసమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షెన్ సభ్యులు మహమ్మద్ అహమ్మద్ జానీ రాణా ప్రతాప్ రెడ్డి సి ఎచ్. కృష్ణ, మాజీ ఎంపిటిసి సరికొండ పాండు ఎకుల మహేందర్, సయ్యద్ అజీజ్, యమ్,యమ్.సి సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి,డిల్లీ శ్రీధర్,బుక్క పాండురంగా రెడ్డి,

డిప్యూటీ తహసీల్దారు,రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు,గ్రామ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది ఇందిరమ్మ కమిటి సభ్యులు మలగల విజయ్ యుగంధర్ రెడ్డి, కత్తుల రాజశేఖర్, మండల ఎస్సి సెల్ అధ్యక్షుడు కత్తుల వెంకటేష్, మాజీ సర్పంచ్ లు ఆరోగ్య రెడ్డి మరియు యాలల శ్రీనివాస్, మద్దెల రాములు,మజీ ఎంపిటి సభ్యుడు గుండాల సురేష్ పార్టీ నాయకులు శంకరయ్య యాదవ్ మద్దెల శ్రీశైలం, మంఖాల రాజు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సివిల్స్ ర్యాంకర్ భారద్వాజ్ ను ఘనంగా సన్మానం

**-ఘనంగా సన్మానించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య**



**షాద్ నగర్, జూన్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)** షాద్ నగర్ పట్టణానికి చెందిన నాగమణి కుమారుడు భరద్వాజ్ సివిల్స్ ఫలితాలలో 905 ర్యాంక్ సాధించిన సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య లు భరద్వాజ్ ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య మాట్లాడుతూ భరద్వాజ్ డిఆర్డివో లో సైంటిస్ట్ గా, ఐఎఎస్ గా, గ్రూప్ వన్ లో కూడ సెలెక్ట్ కావడం సంతోషకరమని అన్నారు. యువత భరద్వాజ్ ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఇటీవల కాలంలో షాద్ నగర్ ప్రాంతానికి చెందిన విద్యార్థులు సివిల్స్ లో ఉత్తమ ఫలితాలు సాధించడం చాలా అభినందనీయం అని అన్నారు. రానున్న రోజుల్లో మన ప్రాంతానికి చెందిన విద్యార్థులు సివిల్స్ లో మరిన్ని విజయాలు సాధించి మన షాద్ నగర్ ప్రాంతానికి మంచి గుర్తింపు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కందూరి మనోహర్ రెడ్డి, మల్ చలం మురళి, బోయ కుర్మయ్య, ఋషికేష్, ప్రశాంత్, మిద్దె గణేష్, కుడుముల బాల్ రాజ్, అనిల్ కుమార్ గౌడ్, రాజు నాయక్, శ్రీరామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి రెవెన్యూ సదస్సుకు హాజరుకానున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అమ్రాబాద్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సు అమ్రాబాద్ మండలం మన్ననూర్ రైతు వేదిక భవనంలో జరుగనుంది. రైతుల భూసమస్యలను సమగ్రంగా పరిష్కరించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరుకానున్నారు. రైతుల భూసమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు ప్రత్యక్షంగా పాల్గొననుండటంతో, భూగానుల సమస్యల పరిష్కారానికి ఇది మంచి అవకాశంగా మారనుంది. ప్రజలు, రైతులు, భూభాధ్యతులు తమ సమస్యలను అధికారులకు దరఖాస్తుల ద్వారా అందించి పరిష్కారం పొందవచ్చు అని మండల కాంగ్రెస్ పేర్కొంది.

## పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం



**హైదరాబాద్, జూన్ 3(నీలగిరిఎక్స్‌ప్రెస్)** మీర్‌పేట నంది హిల్స్ కాలనీ ప్రెసిడెంట్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్లా సురేందర్ రెడ్డి సతీమణి చల్లా సునంద తమ పుట్టినరోజు సందర్భంగా నాదర్గుల్ మానసిక వికలాంగ అనాథ ఆశ్రమంలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమంలోని 150 మంది అభాగ్యులకు అన్నదానం చేసి, ఆకలి తీర్చేందుకు విశేష ఏర్పాట్లు చేశారు. కుటుంబ సభ్యులైన వినీత్ రెడ్డి, భార్గవి, నితిన్ రెడ్డి, జయవాణి, మనవరాలు కృతార తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సేవా సంకల్పాన్ని ప్రతిబింబించారు. ఆశ్రమ సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి మహాదానాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి



**కడ్తాల్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం మక్త మాదారం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామ నాయకులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, గ్రామంలో ప్రభుత్వ భూములు చెరువులు, గుంటకల్లు సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. భూ సమస్యలపై దరఖాస్తులను ఆర్డీవో స్వీకరించారు. రైతుల భూసమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముంతాజ్ బేగం, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ గుడురు భాస్కర్ రెడ్డి, బాల్ రాజు, నరేష్ గౌడ్, యాదగిరి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావు జన్మదినం సందర్బంగా మైసిగండ ఆలయంలో ప్రత్యేక పూజలు



**కడ్తాల్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు సిద్దిపేట శాసనసభ్యులు హరీష్ రావు జన్మదిన సందర్భంగా మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అద్వర్యంలో మైసిగండి మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరీష్ అన్న ఆయుఆరోగ్యలతో తెలంగాణ ప్రజలకు మరిన్ని సేవలు అందిచాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్ , మాజీ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి , మాజీ ఎంపీటీసీ రమేష్ నాయక్ , మాజీ వార్డ్ సభ్యులు కేశని మహేష్ ,కిషన్,శ్రీను,సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు .

## తూప్రాన్ మున్సిపాలిటీలో 100 రోజుల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల ప్రారంభం





**తూప్రాన్, జూన్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వరదల నివారణకు తగిన చర్యలుగా తూప్రాన్ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు వేగవంతమవుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో మోరిలల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను జేసీబీల సహాయంతో శుభ్రం చేయించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం "ఒక్క అడుగు మార్పు కోసం" అనే నినాదంతో జూన్ 2 నుండి సెప్టెంబర్ 10 వరకు చేపట్టిన 100 రోజుల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, మున్సిపల్ ప్రాంతాలను నివాసయోగ్యంగా, పర్యావరణ అనుకూలంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 1వ, 3వ, 12వ వార్డుల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీ దుర్వాసన నివారణ, స్లబ్స్ పునఃస్థాపన వంటి పలు అభివృద్ధి చర్యలు నిర్వహించబడ్డాయి. సిడిఎంఏ సూచనల మేరకు అమలు చేస్తున్న 2వ ఆక్టివిటీగా ఈ కార్యక్రమం సాగినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు సహకరించడంతో ఈ చర్యలు మరింత ఫలప్రదంగా మారుతున్నాయని, నగర శుభ్రత పట్ల ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని కమిషనర్ గణేష్ రెడ్డి పిలుపునిచ్చారు.

## విజయవంతగా భూభారతి రెవెన్యూ సదస్సు

**జోగులాంబ పత్రిక జూన్ 03:**
జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం ఏక్లాస్ పురం గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులో ఐజ మండలం రెవెన్యూ అధికారులు పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమం పి ప్రశాంత్ గౌడ్ డిప్యూటీ తాసిల్దార్, ఆర్ఐ భరత్ కుమార్, మండల సర్వే అనసూయ, రెవెన్యూ సిబ్బంది, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## హరీష్ రావు జన్మదినాన్ని సేవా కార్యక్రమంతో జరుపుకున్న బీఆర్ఎస్ నాయకుడు



**డిండి, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
డిండి మండలం వావిల్ కోల్ (వడ్డెర గూడెం) బీఆర్ఎస్ అధ్యక్షుడు ఓర్సు ముత్యాలు మాజీ మంత్రి హరీష్ రావు జన్మదినాన్ని ప్రత్యేకంగా సేవా కార్యక్రమాలతో జరుపుకున్నారు. హైదరాబాద్‌లో తన నివాస ప్రాంతంలో, హరీష్ రావును కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ తర్వాత పేద ప్రజలకు పాలు, పండ్లు పంపిణీ చేసి సామాజిక సేవకు ప్రాధాన్యతనిచ్చారు. సేవా కార్యక్రమంలో స్థానికులు భాగస్వామ్యమై,స్వచ్ఛందంగా ప్రజలకు సహాయం చేయడమే నిజమైన జన్మదిన వేడుక అంటూ స్పందించారు. సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూ,బీఆర్ఎస్ నాయకుడి ఈ కార్యక్రమానికి అభినందనలు తెలిపారు.

## వారధి ఉద్యోగాల అవకతవకల పై మంత్రికి ఏఐవైఎఫ్ ఫిర్యాదు



**కరీంనగర్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లాలోని వారధి ద్వారా ప్రభుత్వ మేడికల్ కాలేజీ ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్లపల్లి యుగేందర్ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం అందజేశారు. వారధి ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు మెరిట్ ప్రాతిపదికపై కాకుండా అక్రమంగా భర్తీ చేయబడుతున్నాయని అనేక నిరుద్యోగులు పలు మార్లు జిల్లా కలెక్టర్ వద్ద ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు విచారణ జరగలేదని యుగేందర్ అసహనం వ్యక్తం చేశారు. ఈ నియామకాల్లో జిల్లాలోని పెద్ద తలకాయల హస్తం ఉందని,అందుకే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. రిటైర్డ్ అధికారి ఆంజనేయులు వారధి ఇంచార్జీగా కొనసాగుతూ తన కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇప్పించుకోవడం,నిరుద్యోగులను మోసం చేయడం,డబ్బులు దండుకుని నియామక ప్రక్రియను ప్రభావితం చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం రంగ ప్రవేశం చేసి విచారణ చేపట్టాలని,వారధి నిర్వహణలో ఉన్న అనైతిక కార్యకలాపాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు తక్షణమే విచారణ జరిపించి అధికారుల చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని ఏఐవైఎఫ్ నేతలు స్పష్టం చేశారు. తదుపరి చర్యలు తీసుకోకపోతే, నిరుద్యోగులను కలుపుకుని వారధి కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

### నేడు ఆర్టీసీ క్రాస్ రోడ్డులో సిటీ కల్చరల్ సెంటర్ లో ఉప్పు సత్యనారాయణ జన్మదినం సందర్భంగా తెలంగాణ ఐకాన్ అవార్డ్స్ ప్రధానం...

**-హాజరుకానున్న అతిరథ మహారథులు...**

**హైదరాబాద్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రముఖ స్వచ్ఛంద సేవకులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జర్నలిస్ట్ యూనియన్ పూర్వ అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ జన్మదిన జన్మదినం సందర్భంగా సావిత్రి సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ మరియు తెలంగాణ పట్టభద్రుల జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని శ్రీ నాయిని నరసింహారెడ్డి స్టీల్ బ్రిడ్జ్ 45వ పిల్లర్ వద్ద సిటీ కల్చర్ కల్చరల్ సెంటర్లో బుధవారం తెలంగాణ ఐకాన్ అవార్డ్స్ ల కార్యక్రమం జరగనున్నది. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు మరియు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తదితరులు హాజరు కానున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సంబరాలు సందర్భంగా తెలంగాణ సాధనలో ఉద్యమకారుల పాత్ర పై చర్చ గోష్టి ఉంటుందని సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ ప్రెసిడెంట్ మీనగా గోపి సీఈవో శ్రీ పరమేశ్వర్ ఈ సందర్భంగా తెలియజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు గాయని గాయకుల కచేరి తో కార్యక్రమం మొదలవుతుందని, తెలంగాణ పాటలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.


## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.
నిజం బయటికి తీయడం కోసం , నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్‌ప్రెస్! న్యూస్ సంప్రదించండి.
అన్నివేళలా మీతో పాటు ఉంటుంది
ఇమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909
మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.


**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**


## ఏఎస్ఐ మల్లారెడ్డి ఘనంగా సన్మానించిన కమిషనర్ గౌష్ ఆలం




**కరీంనగర్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సైదాపూర్ పోలీస్ స్టేషన్ లో 36 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో నిష్టతో సేవలందించిన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) పి. మల్లారెడ్డి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్, మల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలిపి,పూలమాల,శాలువా సమర్పించి, జ్ఞాపికను అందజేశారు.పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని జాగ్రత్తగా రక్షించుకోవాలని,పోలీస్ సేవలు గర్వించదగినవి అని ఆయన పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి (సంక్షేమం), కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మల్లారెడ్డి సేవలను కొనియాడుతూ,ఆయన ధృడ నిబద్ధత పోలీస్ శాఖకు ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

## 40వ డివిజన్ లో పర్యటించిన డివిజన్ ఇంచార్జ్ ఊగిలే సుధాకర్ పటేల్





**కరీంనగర్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ బ్యాంక్ కాలనీ రోడ్ నెంబర్ 1 లో స్థానికులను కలిసినప్పుడు గత పాలకులు రెండు సంవత్సరాల కింద నాణ్యత లోపించిన సిసి రోడ్డును డ్రైనేజీని తొలగించారని ఇప్పటివరకు దాన్ని పట్టించుకోలేదని మేము ఇళ్లలోకి వెళ్లడానికి ప్రతి ఇంటికి 40 వేలు ఖర్చు పెట్టుకుని ఇంటి ముందు సిమెంటు బిల్లలు వేసుకున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ డ్రైనేజీ పైన బిల్లలు వేయకుండా వదిలేశారని దానిపైన ఉన్న ఇనుప చూవ్వలు పిల్లలకు గుచ్చుకొని సెప్టిక్ లు అయ్యాయని వృద్ధులకు ప్రమాదకరంగా మారాయని చెప్పారు గత పాలకులకు చెప్పిన పట్టించుకోలేదని. నా దృష్టికి తీసుకువచ్చారు నేను వాళ్లకి ఒకటే హామీ ఇచ్చాను వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో నన్ను ఆశీర్వదించండి గెలిచిన వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో మరియు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ రోడ్డును డ్రైనేజీని వాటితో పాటు మీ సమస్యలన్నింటినీ తీర్చే బాధ్యత నాది అని వారికి వివరించడం జరిగింది.

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"

మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# తెలంగాణలో అభివృద్ధి నిరాశాజనకం

-బొడ్ల శ్రీరాములు




**కరీంనగర్, జూన్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 11 ఏళ్లైనా ప్రజలు ఆశించిన అభివృద్ధి కనిపించడంలేదని బొడ్ల శ్రీరాములు వ్యాఖ్యానించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం వేలాది మంది పోరాడి ప్రాణాలు అర్పించగా,ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి ఆందోళనకరంగా మారిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా పాలకులు వ్యవహరించారు అని ఆయన విమర్శించారు. "మేం మన నీళ్లు, నిధులు, నియమకాలు మాగ్గాలని కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఇంకా తీరలేదని, నిరుద్యోగులకు అవకాశాలు తగ్గిపోవడం, ప్రభుత్వ హామీలు అమలు కాకపోవడం తెలంగాణ ఉద్యమ ద్రోహమే" అని ఆయన ఆరోపించారు. కళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృధా చేశారని,రాష్ట్రాన్ని అప్పులపాలు చేయడం వల్ల అభివృద్ధి పరమాదంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక పరిస్థితి దిగజారింది, ప్రజలు ఆశించిన స్థాయిలో పాలన కొనసాగడం లేదు" అని అభిప్రాయపడ్డారు. "మార్పు కోసం ప్రజలు పోరాటం చేయాలి, అభివృద్ధి సాధించేందుకు ఉత్తమ నాయకత్వం రావాలి" అని శ్రీరాములు పేర్కొన్నారు. "తెలంగాణ ప్రజలు ఆకాంక్షిస్తున్న శాశ్వత అభివృద్ధి కోసం పరిపాలన మారాల్సిన అవసరం ఉంది" అని హితవు పలికారు.

# ఘనంగా మాజీ మంత్రి టి.హరీష్ రావు గారి జన్మదిన వేడుకలు..

**జహీరాబాద్ ప్రతినిధి జూన్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

మాజీ మంత్రి ఎమ్మెల్యే టి.హరీష్ రావు గారి జన్మదినం సందర్భంగా మొగుడంపల్లి మండల కేంద్రంలో బి.ఆర్.ఎస్ నాయకులు శికారి గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన జన్మదిన వేడుకల్లో టిఎస్ఎస్ సిసిడిసి (ఎస్సి కార్పొరేషన్) మాజీ చేర్మెన్ వై.నరోత్తం గారు పాల్గొని పార్టీ నాయకులతో కలిసి జన్మదిన కేక్ ను కట్ చేసి ఘనంగా జరుపుకోవడం జరిగింది,మరియు ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేయడం జరిగిందని,ఈ కార్యక్రమంలో శికారి గోపాల్, కె.వెంకట్,యం.జైపాల్, జేట్టప్ప,నాగేష్ యాదవ్, ఆర్.బాల్ రాజ్, బి.సంతోష్, యం.అనంత్ రామ్,దిలీప్, జె.రాజు,ఏ.నర్సింలు,విఠల్, కృపాకర్,అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ఇళ్లు ఇవ్వాలన్నదే సర్కార్ సంకల్పం





-లబ్ధిదారుల ఎంపికలో పైరవీలకు తావు లేదు
-610 మందికి ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి

**మానకొండూరు, జూన్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలన్న సంకల్పంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. మానకొండూర్ మండల కేంద్రంలోని కేఎస్సార్ ఫంక్షన్ హాల్ లో వివిధ గ్రామాలకు చెందిన 610 మంది లబ్ధిదారులకు ఆయన ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగానే లబ్ధిదారుల ఎంపిక జరిగిందని, ఈ విషయంలో ఎలాంటి పైరవీలకు తావు లేదని చెప్పారు. ఇళ్ల మంజూరు ప్రక్రియ ఏటేటా జరుగుతుందని, ఈ దఫా రాని వాళ్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులకు మరో దఫాలో తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. పేదలకు గూడు కల్పించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. పేదలపట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు ఎందుకు కట్టించి ఇవ్వలేకపోయారని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తున్నదని ఆయన చెప్పారు. ఇది జీర్ణించుకోలేకనే బీఆర్ఎస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల పథకంపై తప్పుడు ప్రచారం సాగిస్తూ నిరుపేదల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఆయన విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలకు పూనుకోవాలని, మూడు నెలల్లోగా నిర్మాణాలు చేపట్టని వారి ఇళ్లను రద్దు చేసి మిగితా వారికి ఇస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి వరలక్ష్మి, తహసిల్దార్ విజయ్ కుమార్, హౌసింగ్ ఏఈ దుర్గం మహేశ్, మానకొండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, దూలం దేవేంద్ర, కోండ్ర సురేశ్,కోండ్ర అశోక్, ఇర్ఫాన్, కొత్తకొండ శంకర్, మడుపు ప్రేమ్ కుమార్, వాల అంజిత్ రావు, గొల్లెన కొమురయ్య, సాయిరి దేవయ్య, సుధగోని తిరుపతి, బోళ్ల మురలీధర్, నరేశ్, మహమూద్, అజహర్, కవిత, వందన, లక్ష్మారెడ్డి, చిరంజీవి, ఎన్.బాపురావు, కనకం కుమార్, మహేందర్, మీస సత్యనారాయణ, ముక్కెర సతీష్, బుర్ర శ్రీధర్, సహదేవ్, అంజయ్య, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రామగిరి సంతోష్, నాగిశెట్టి రాజయ్య, తోట శ్రీనివాస్, బాకారపు రమేశ్, జీడీ శ్యామ్, వరహాల చారి తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో భూసమస్యలకు సత్వర పరిష్కారం

**మానకొండూరు, జూన్ 3( నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



ముంజంపల్లి గ్రామం రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ధరణి వల్ల ఎదురైన భూసమస్యలను భూభారతి చట్టంతో పరిష్కారమవుతాయని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మానకొండూర్ మండలం ముంజంపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో భూభారతిపై నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి వల్ల రైతులు, భూ యజమానులు లేని సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందని, అనేక రకాలుగా మోసాలకు గరయ్యారన్నారు. పదేళ్లుగా ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం మేధోమధనం చేసి భూ భారతి చట్టం తీసుకు వచ్చిందని ఆయన వివరించారు. భూ భారతి వల్ల రైతులకు, భూ యజమానులకు మేలు జరుగుతుందే తప్ప భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. భూభారతితో అక్రమాలకు అవకాశం ఎంతమాత్రం లేదని, అధికారులెవరైనా ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ చట్టంతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూభారతి చట్టం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో ఏ రాష్ట్రంలో రెవె న్యూ చట్టం తయారుచేయాలన్న ఆదర్శంగా ఉండే విధంగా భూ భారతి చట్టం ప్రజా ప్రభుత్వం తయారుచేసిందని, దేశానికి ఆదర్శంగా భూ భారతి చట్టం నిలుస్తుందన్నారు. ఈ సదస్సులో మానకొండూర్ మండల తహసీల్దార్ విజయ్ కుమార్, మానకొండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రేమిడి శ్రీనివాస్ రెడ్డి, మీస సత్యనారాయణ, సాయిరి దేవయ్య, సుధగోని తిరుపతి దూలం దేవేంద్ర, కవిత, వందన, కోండ్ర సురేశ్,కోండ్ర అశోక్, ఇర్ఫాన్, కొత్తకొండ శంకర్ మడుపు ప్రేమ్ కుమార్, వాల అంజిత్ రావు,గొల్లెన కొమురయ్య,బోళ్ల మురలీధర్,నరేశ్, మహమూద్, అజహర్,లక్ష్మారెడ్డి, చిరంజీవి, ఎన్.బాపు రావు, కనకం కుమార్, మహేందర్, ముక్కెర సతీష్, బుర్ర శ్రీధర్, సహదేవ్, అంజయ్య, లక్ష్మారెడ్డి, రా, నాగిశెట్టి రాజయ్య, తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారంతో పేదల్లో ఆత్మగౌరవం పెంపు

**మానకొండూర్, జూన్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**





మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సొంతింటి కలను సాకారం చేయడం ద్వారా సమాజంలో నిరుపేదల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తున్నామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఇల్లంతకుంట మండలం జంగంరెడ్డిపల్లిలోని మాతా అన్నపూర్ణేశ్వర ఫంక్షన్ హాల్లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నిరుపేదల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టిందన్నారు. నిరుపేద ఆత్మగౌరవానికి ఇందిరమ్మ ఇళ్లు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు.నిరుపేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న సోయి గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి లేకుండా పోయిందని ఆయన ఎద్దేవా చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరిట నిరుపేదలను గత ప్రభుత్వం మోసం చేసిందన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ ఇండ్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని, లేనిపక్షంలో వాటిని రద్దు చేసి ఇతరులకు ఇవ్వాల్సి వస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను అమలు పరుస్తున్నదన్నారు. ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే సిలిండర్, రైతు భరోసాతోపాటు సన్న బియ్యం పథకం అమలు చేస్తున్నదన్నారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వనున్నదని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏది చేసిన పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని చేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, భూ హక్కుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం వినియోగించుకొని జూన్ 3 నుంచి జూన్ 20 వరకు ప్రతి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజల వద్దకు వెళ్లి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఇక నుంచి భూముల క్రయ విక్రయాలకు తప్పనిసరిగా మ్యాప్ జత చేయాలని, దీని కోసం తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా 7 వేల లైసెన్సెడ్ ప్రైవేటు సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. సాదా బైనమా దరఖాస్తులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రస్తుతం భూమి ఎవరి కబ్జాలో ఉంటే పంచనామా, స్థానికంగా విచారణ చేసి వారికి పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డిఓ వెంకటేశ్వర్లు, ఇల్లంతకుంట తహసిల్దార్ ఫారూఖ్, ఇల్లంతకుంట మండల అభివృద్ధి అధికారి శశికళ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పార్టీ నాయకులు వెంకటరమణారెడ్డి గుడిసె అయిలయ్య, పసుల వెంకటి, ఆకుల సత్యం, ఎల్లందుల ప్రసాద్, వెలిచాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరులను అవమానించేందుకే వివాదాస్థలములో స్థూపం

-జై తెలంగాణ అనని నోళ్ళు ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేగా ఉండడం మన దుస్థితి
-అమరవీరుల స్థూపం కలెక్టరేట్ సముదాయం ముందు పార్కులో ఏర్పాటు చేయాలి
-రోడ్డులేనిచోట జయశంకర్ సార్ విగ్రహం ఎట్లా పెడతారు
-గట్టు యాదవ్ జిల్లా బి.ఆర్.ఎస్ అధ్యక్షులు



**వనపర్తి,మే 03( నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వాల్మీకి సోదరులకు కేటాయించిన వివాదస్పద స్థలములో ఆదరాబాదరాగా స్థూపానికి స్థలం కేటాయించడం ఎమ్మెల్యే అవగాహన రాహిత్యానికి,అమరులను అవమానించేందుకే అని గట్టు యాదవ్ మండిపడ్డారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గతములో అమరవీరుల ఏకశిలా స్థూపం కలెక్టరేట్ ముందు గల పార్కులో ఏర్పాటు చేయాలని నిర్ణయించారని అంతలోని ఎన్నికలు రావడం వల్ల వీలుకాలేదు అని అన్నారు. అమరవీరులకు కె.సి.ఆర్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చి హైదరాబాద్ నడిబొడ్డులో సెక్రటేరియట్ ఎదురుగా అమరవీరుల స్థూపం నిర్మించారని అదేవిధంగా ఉద్యమ సమయములో గన్ పార్క్ నందు అమరవీరుల స్థూపం నిర్మించారని గుర్తు చేశారు. జై తెలంగాణ అనని నోళ్ళు నేడు సి.యం.,ఎం.ఎల్.ఎగా ఉండడం తెలంగాణ ప్రజల దురదృష్టం అని అమరవీరులను గౌరవించాలంటే గౌరవప్రదమైన చౌరస్తాలో లేదంటే జనసమూహం రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయాల దగ్గర ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని అన్నారు. వాల్మీకి సోదరులకు మున్సిపల్ తీర్మానంతో కేటాయించిన స్థలములో స్థూపాన్ని నిర్మించడం వల్ల కుల సంఘాలకు చిచ్చు పెట్టినవారవుతారని అన్నారు ఏం.ఎల్.ఏ నిర్ణయం మార్చుకొని అందరికీ అనువైన కలెక్టరేట్ సముదాయం ముందు పార్కులో ఏర్పాటు చేయాలి అని గట్టు యాదవ్ డిమాండ్ చేశారు. జయశంకర్ విగ్రహం లేని రోడ్డులో పెడతామనడం హాస్యాస్పదం అని గట్టు ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి బై పాస్ రోడ్డు ఏర్పాటు చేస్తే తమ అనుచరుల ప్రయోజనాల కోసం కుట్రపన్ని బై పాస్ రోడ్డు నిలిపివేసిన ఏం.ఎల్.ఏ నేడు లేని రోడ్డు(కలెక్టరేట్ చౌరస్తా)లో జయశంకర్ సార్ విగ్రహం ఏర్పాటు చేస్తానడం విడ్డూరంగా ఉందని అన్నారు. అసలు ఉద్యమకారులన కాదని నకిలీలకు సన్మానమా.. వేణు గోపాల్,మాజీ జె.ఏ.సి ఛైర్మెన్ ఉద్యమములో మొదటి నుండి ఉండి కష్టనష్టాలకు ఓర్చి, ఉద్యోగాలు ఫణంగా పెట్టీ సకలజనుల సమ్మెలో వివిధ ఉద్యమాలలో కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు,కులసంఘాల నాయకులు పోరాడితే వాళ్లను కాదని నకిలీ ఉద్యమకారులు,కాంగ్రెస్ కార్యకర్తలను ఏం.ఎల్.ఏ సన్మానించడం దురదృష్టకరం అని వేణు గోపాల్ అన్నారు. అమరవీరుల స్థూపాన్నీ అందరికి ఆమోదయోగ్యమైన మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నిర్ణయించినట్లుగా కలెక్టరేట్ సముదాయం ముందు పార్కులో ఏర్పాటు చేయాలి అని వేణు గోపాల్ డిమాండ్ చేశారు. మా స్థల రక్షణకు వాల్మీకి సంఘాలు పోరాడతాయి. విజయ్ కుమార్ మార్కు ఫెడ్ డైరెక్టర్ ఉంగ్లం. తిరుమల్ మాజీ కౌన్సిలర్. వాల్మీకుల ఆత్మగౌరవం కోసం మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సంఘానికి వివేకనందా చౌరస్తాలో విశాలమైన స్థలం కేటాయించారని కానీ నేడు ఏం.ఎల్.ఏ మా మనోభావాలు కించపరుస్తూ అందులోనే అమరవీరుల స్థూపానికి పూజా చేయడం సరియైనది కాదని కొందరు ఉద్దేశ్యపూర్వకంగా చెప్పిన మాటలు విని ఏం.ఎల్.ఏ నిర్ణయం తీసుకోవడాన్ని ఖండిస్తున్నామని అమరవీరుల స్థూపానికి మేము వ్యతిరేకం కాదు కానీ గౌరవప్రదమైన స్థానములో అత్యంత విలువలతో కలెక్టరేట్ సముదాయం ముందు పార్కులో ఏర్పాటు చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ సమావేశములో నాగన్న యాదవ్, నీలస్వామి, జోహెబ్ హుస్సేన్, చిట్యాల.రాము, తోట.శ్రీను, తిరుపతియ్య పాల్గొన్నారు.

## వీపనగండ్ల పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వనపర్తి, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వీపనగండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి 1987-88 ఎస్ఎస్సి బ్యాచ్ కు చెందిన 38వ సంవత్సరపు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. వనపర్తి పట్టణంలోని శ్రీనిధి ఏసీ బ్యాంకెట్ హాల్లో జరిగిన కార్యక్రమంలో,ఆనాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ విద్యా బుద్ధికి పునాది వేసిన గురువులను ఘనంగా సత్కరించేందుకు,శాలువాలు కప్పి, పూలమాలలు సమర్పించి, కృతజ్ఞతా పూర్వకంగా అభినందనలు తెలిపారు. నాటి ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి,హిందీ ఉపాధ్యాయులు ఖాజా మొయినుద్దీన్,వ్యాయామ ఉపాధ్యాయులు శేఖర్ రెడ్డి, సుగుణా రెడ్డి కార్యక్రమానికి హాజరై విద్యార్థుల జీవిత మార్గదర్శకత్వంపై చక్కటి ఉపన్యాసాలు ఇచ్చారు. స్థిరపడ్డ విద్యార్థులు,ఆపదలో ఉన్న స్నేహితులకు సహాయసహకారాలు అందిస్తూ,స్నేహబంధాన్ని మరింత బలపరిచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వారు సూచించారు. పూర్వ విద్యార్థుల కుమార్తెలు, కుమారులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించడాన్ని ఉపాధ్యాయులు అభినందించారు. చదువులో ప్రతిభ కనబరుస్తున్న చిన్నారులను సత్కరించి,భవిష్యత్తు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తూ,ఇలాంటి సభలు తరచుగా నిర్వహించాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు,నృత్యాలు, ఆటపాటలతో ఆనందంగా ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ,స్నేహబంధాన్ని మరింత బలపరిచేందుకు ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

## పుష్పలీల కుమారుడు తరుణ్ రెడ్డి రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న 1989-1990 ఎస్ఎస్సీ బ్యాచ్ మిత్ర బృందం





**ఇబ్రహీంపట్నం జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** యాచారం మండలం నక్కర్త - మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎస్సీ బ్యాచ్ కునిరెడ్డి (మంచిరెడ్డి) పుష్పలీల , శ్రీ హరిశ్చంద్రారెడ్డి పుత్రుడు తరుణ్ రెడ్డి ,శైలజ వెడ్డింగ్ రిసెప్షన్ అంగరంగ వైభవంగా హైదరాబాద్ లోని వేద కన్వెన్షన్ లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో పుష్పలీల ఎస్ఎస్సీ 1989- 1990 మిత్ర బృందం పాల్గొని నూతన వధూవరులను శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ వేడుకలో గడాల రాజు, కపిల్ దేవు రెడ్డి , జహంగీర్, విరబొమ్మ శివకుమార్ , పి .శివ కుమార్ , పాలోజు భిక్షపతి , మల్లారెడ్డి, రెడ్డి, రఘునందన్ రెడ్డి, లిక్కి క్రిష్ణ రెడ్డి, బొడ్డుపల్లి సుజాత, బండారు విజయలక్ష్మి, దెంది అండాలు, పద్మ , లక్ష్మణ్ మిత్రబృందం పాల్గొన్నారు.

## షాద్ నగర్ లో ఘనంగా మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జన్మదిన వేడుకలు

సర్కార్ దవాఖాన ఆవరణలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న బీఆర్ఎస్ శ్రేణులు





**షాద్ నగర్, జూన్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను షాద్ నగర్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ సూచన మేరకు బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సర్కార్ దవాఖానా ఆవరణలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర వెల కట్టలేనిది, పదేండ్ల కేసీఆర్ పాలనలో హరీష్ రావు తనదైన శైలిలో రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు అయ్యారని, భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఎన్నో సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రైతుల పాలిట దేవుడయ్యారని కొనియాడారు. ఆయన వ్యవహార శైలి, పనితీరు మేడి తరం నాయకులకు ఆదర్శనీయమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, నాయకులు లక్ష్మణ్ నాయక్, వీరేశం గుప్తా, వెంకట్రాం రెడ్డి, బచ్చలి నరసింహా, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, చీపిరి రవి యాదవ్, హరికృష్ణ గౌడ్, గౌస్ జానీ, నందిగామ శ్రీనివాస్, జంగయ్య, రాహూఫ్, రమేష్ యాదవ్, భువనేశ్వర్ రెడ్డి, గుండు అశోక్, కంది రాఘవేందర్ గౌడ్, శివ ఎస్పీ, అద్నాన్, శరత్, సుశాంత్, మంగ శ్రీశైలం, సందీప్ సింగ్, పిట్టల మల్లేష్, నవీన్, అభిలాష్, రాజశేఖర్, భాస్కర్, కావలి రాకేష్, సంజు నాయక్, చౌలపల్లి శ్రీకాంత్, తేజ, పవన్, సాయి తేజ, జగన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


## సైనిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి



**హైదరాబాద్, జూన్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)** తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థుల భవిష్యత్తు కోసం స్థానిక సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో, చైర్మన్ జి. చిన్నారెడ్డి, దివ్య ఐఏఎస్ కు వినతిపత్రం అందజేశారు. సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు స్థానికంగా ప్రవేశ అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని, ఈ అకాడమిక్ సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. విధిగా కేంద్రీయ మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపించి, తెలంగాణలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తల్లిదండ్రుల ఆవేదనను కూలంకషంగా పరిశీలించిన అధికారులు, ప్రభుత్వానికి తగిన సూచనలు అందజేసి, ఈ ఏడాదే తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు. కేంద్రానికి పంపిన ప్రతిపాదనలతో, విద్యార్థుల కోసం ప్రత్యేక సైనిక్ స్కూల్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు రాము సాగర్, ఐలయ్య, లక్ష్మణ్, మహేష్, స్వప్న, లావణ్య, సునీత, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతున్న పేదవాడి సొంతింటి కల

-అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం,సంతోషాన్ని వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
-ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
-పారదర్శకంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక జరిగిందని ప్రలోభాలకు, పైరవీలకి తావు ఉండదు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**కొందుర్గ్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కొందుర్గ్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ గారు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,సింగిల్ విండో చైర్మన్ దామోదర్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్, యాదయ్య , రాంచంద్రయ్య,రాములు గౌడ్,మంగులాల్ నాయక్, గోపాల్, గోవర్ధన్ గౌడ్,మల్లేష్ గౌడ్,సత్యనారాయణ రెడ్డి,పురుషోత్తం రెడ్డి,అంజి రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

తాసిల్దార్ సతీష్ కుమార్..

**పాపన్నపేట జూన్ -3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని మండల తహశీల్దార్ సతీష్ కుమార్, అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని కొంపల్లి, ముద్దాపూర్, గ్రామాలలోని గ్రామపంచాయతీ కార్యాలయలో భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. భూ సమస్యలపై ప్రజలు, రైతులు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహశీల్దార్ సతీష్ కుమార్ తెలిపారు. ముద్దాపూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు ను అడిషనల్ కలెక్టర్ నాగేష్, సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సలహాలు సూచనలు అందించారు అనంతరం గ్రామస్తులతో చర్చించారు.

## మాడుగుల మండలంలో రెవెన్యూ సదస్సులు



**మాడుగుల,జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తాసిల్దార్ వినయ్ సాగర్ మాడుగుల మండలంలో ప్రభుత్వ ఆదేశానుసారం 15 రెవిన్యూ గ్రామాల్లో తాసిల్దార్ వినయ్ సాగర్ డిప్యూటీ తాసిల్దార్ రాజశేఖర్ రెడ్డి లు రెండు బృందాలుగా ఏర్పడి రెవెన్యూ సదస్సులో నిర్వహిస్తున్నట్టు వినయ్ సాగర్ తెలియజేశారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ రైతులు తమ భూమి సంబంధించిన సమస్యలను ఆయా గ్రామాల్లో సదస్సులో దరఖాస్తు చేసుకుని పరిష్కరించుకోవాలని ఆయన రైతులకు సూచించారు గ్రామాలైన 4న అన్న బోయినపల్లి , కోల్కలపల్లి,5న బ్రాహ్మణపల్లి, మాడుగుల, 6న దొడ్లపాడు, అందుగుల ,9న ఆవురుపల్లి, అర్కపల్లి 10న కలకొండ, అప్పరెడ్డిపల్లి,11న నాగిళ్ల రమణంపల్లి,12న ఇర్విన్ రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తాసిల్దార్ వినయ్ సాగర్ తెలిపారు.

## చదరంగం క్రీడా పోటీలకు షాద్ నగర్ ఏసీపి లక్ష్మీనారాయణకు ఆహ్వానం

### ఏసీపీ లక్ష్మీనారాయణ ను ప్రత్యేకంగా ఆహ్వానించిన చదరంగం పోటీల క్రీడా నిర్వాహకుడు వానరాసి జగన్




**షాద్ నగర్, జూన్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నేడు ఉదయం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో శ్రీ సరస్వతి శిశు మందిర్ స్కూల్ ప్రక్కనగల పతంజలి యోగా సెంటర్ లో చదరంగం క్రీడల పోటీలు నిర్వహించనున్నట్లు షాద్ నగర్ చెస్ అకాడమీ కోచ్, చదరంగం క్రీడా పోటీల నిర్వాహకుడు, ఆర్బిటర్ వానరసి జగన్ తెలిపారు. చదరంగం క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక అతిథులుగా, జ్యోతి ప్రజ్వలన కావించడానికి షాద్ నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణను ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానించారు. చదరంగం క్రీడా పోటీల ఆహ్వానానికి ఏసీపీ లక్ష్మీనారాయణ సుముఖత వ్యక్తం చేసినట్లు, కార్యక్రమానికి హాజరుకానున్నట్లు పోటీల నిర్వాహకుడు వానరాసి జగన్ తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ లక్ష్మీనారాయణ క్రీడల పట్ల తనకున్న అభిమానాన్ని సంతోషంగా వ్యక్తం చేసినట్లు, చదరంగం క్రీడల పోటీలకు హాజరుకానున్నట్లు క్రీడా పోటీల నిర్వాహకుడు వాన రాశి జగన్ తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట పట్టణంలో నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి,ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా,అచ్చంపేటకు తొలిసారి వచ్చిన మల్లు రవికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం పట్టణ అభివృద్ధికి గాను సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనుసరిస్తున్న పథకాలను సమర్థంగా అమలు చేయడమే తమ లక్ష్యమని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు. అచ్చంపేట పట్టణాభివృద్ధి నిరంతరంగా కొనసాగుతుందని,ప్రభుత్వం అవసరమైన అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలతో అచ్చంపేట పట్టణానికి మరింత ప్రగతి చేకూరుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

## పట్టణ అభివృద్ధే మాప్రభుత్వ ధ్యేయం

### మంత్రి శ్రీధర్ బాబు



**ఎల్బీనగర్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పట్టణ అభివృద్ధే ధ్యేయంగా మా ప్రభుత్వం పని చేస్తుందని, జిహెచ్ఎంసి ట్యాక్స్ రూపంలో వచ్చే ప్రతి రూపాయి జిహెచ్ఎంసిలో ఉన్న ప్రతి కాలనీల అభివృద్ధి కోసం ఉపయోగిస్తున్నామని రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం వనస్థలిపురంలోని జాంగిర్ నగర్, మల్లికార్జున నగర్ కాలనీల్లో నూతనంగా డ్రైనేజీ పైప్ లైన్, పార్కును కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎంపీ మధుయాస్కీ గౌడ్, స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం జీహెచ్ఎంసి నిధులు వివిధ ప్రాజెక్టుల కోసం ఉపయోగించేదని, ఈ ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం ప్రజలకు అనుగుణంగా పనులు చేస్తూ ప్రజల అవసరాల కోసమే నిధులు మంజూరు చేస్తూందని ఆయన తెలిపారు.గతంలో ఎప్పుడూ లేని విధంగా అధికంగా నిధులు కేటాయించడం చాలా సంతోషంగా ఉందని మధుయాష్కి గౌడ్ అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు కోసం జిహెచ్ఎంసి నిధులు మళ్లించారని ఆయన పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్న, వజీర్ ప్రకాష్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు కుట్ల నరసింహ యాదవ్ కాలనీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, సాయి చరణ్, హరినాథ్రెడ్డి, సాయి కిరణ్ గౌడ్, రాజేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమానికి అంకిత జీవితం





## జర్నలిస్టుగా – ఉద్యమకారుడిగా ఉప్పు సత్యనారాయణ ప్రస్థానం





సీనియర్ పాత్రికేయులు ఉప్పు సత్యనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ దేశంలో ఉద్యమాలెన్నో నాయకులెన్నో ఉద్యమాల పుట్టినిల్లు అయిన తెలంగాణ నేలపై, ఆవేశపు నినాదాల కన్నా ఆచరణలోనే నమ్మకం పెట్టుకున్న కొంతమంది ఉన్నారు. వారిలో పేరు చెబితే ముందు గుర్తొచ్చే వ్యక్తి - ఉప్పు సత్యనారాయణ. ఈ రోజు ఆయన జన్మదినం. వ్యక్తిగత ఘనతను తక్కువ చేసి, ప్రజల సమస్యలే ప్రథమం అని విశ్వసించిన ఓ సజీవ సందేశం ఆయన జీవితం. తెలంగాణ మలిదశ ఉద్యమంలో, ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో 2009 –2014 మధ్య సాగిన ఉద్యమ తళుకుల్లో ఆయన పాత్ర గుర్తుండేలా ఉంది. నిరాహార దీక్షలు, రాస్తారోకోలు, జేఏసీల సమన్వయం, విద్యార్థి సమావేశాలు – ఇవన్నీ ఓ వైపు కొనసాగుతుంటే, మరోవైపు ఆయన జర్నలిస్టుగా కూడా నిజాయితీకి ప్రతీకగా నిలిచారు. వాస్తవానికి జర్నలిజం రంగంలో ఆయన ప్రస్థానం 1990 నుంచే ప్రారంభమైంది. కలం చేతిలోకి వచ్చాక అది కేవలం వార్తలకోసం కాదు, ప్రజల తరపున ప్రశ్నించేందుకు ఉండాలని నమ్మిన వ్యక్తి. “దర్గాగా రోడ్డు కబ్జా” కథనం ద్వారా అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వాన్ని స్పందింపజేసిన ఘనత ఆయన సొంతం. జర్నలిస్టుగా పని చేస్తూనే, జర్నలిస్టుల సంక్షేమం కోసం కూడా పోరాటం చేశారంటే – అది మామూలు విషయం కాదు. 160 మంది పాత్రికేయులకు ఇళ్ల పట్టాలు ఇప్పించిన ఘనత ఆయనకు చెందుతుంది. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు కనిపించిన ఆయన, 1987–88లో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా సేవలు అందించారు. అప్పటి నుంచే ఆయన లోపల ఉద్యమ దీక్ష, సామాజిక చింతన పెరిగింది. “ఒక్కో సమస్యకు నినాదం కాదు, పరిష్కారం చూపించే పోరాటం కావాలి” అన్నది ఆయన నమ్మకం. Telangana ఉద్యమం తరువాత కూడా ఆ పోరాటం ఆగలేదు. నిరుద్యోగ భృతి, పాత పెన్షన్ పథకం, జర్నలిస్టులకు హెల్త్ కార్డులు వంటి అనేక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో ఆయన పాత్ర కొనియాడతల్సిందే. ప్రస్తుతం IJU (ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆయన, సమాజం కోసం పని చేయాలన్న తపనతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి సారించడం గమనార్హం. పాలకులతో జట్టు కట్టే రాజకీయ కోణం కంటే – ప్రజల గొంతుకగా ఉండాలన్న సంకల్పమే ఆయన ప్రత్యేకత. ఈ నేపథ్యంలో ఆయన జన్మదినం ఒక సందర్భం మాత్రమే కాదు – ఉద్యమ జీవితం మీద ఒక మననం కావాలి. నేటితర యువతకు ఆదర్శంగా నిలవగల జీవన యానాన్ని కలిగిన వ్యక్తిని గుర్తు చేసుకోవాల్సిన సమయం ఇది. ఆయన జీవితం చెప్పే ఒకే సందేశం: “ఓ వ్యక్తి మారితే ఓ సమాజం మారుతుంది.” ఉప్పు సత్యనారాయణ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆయన పోరాట పథం, సేవా సంకల్పం ఇంకా ఎన్నో జీవితాలకు దారిదీపంగా మారాలని ఆకాంక్షిస్తూ

**ఈ సంపాదకీయాన్ని అంకితం చేస్తున్నాం.**

# తెలంగాణ సచివాలయంలో అంబరాన్ని అంటిన తెలంగాణ సంబరాలు





**హైదరాబాద్, జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ సచివాలయంలో, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ తల్లి చిత్రపటాన్ని పూలమాలతో అలంకరించిన ఉద్యోగులు మహనీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ , ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటాలకు పూలతో నివాళులు అర్పించారు.. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ తెలంగాణ పోరాట యోధులను, అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, ఆనాటి ఉద్యమంలో సచివాలయ ఉద్యోగులు పోషించిన ప్రధాన భూమిక ను తెలంగాణ ఉద్యమానితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు. అనంతరం సెక్రటేరియట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ప్రేమ్ మాట్లాడుతూ ఆనాడు విద్యార్థి దశలో ఉన్నప్పుడు లాఠీలకు



తూటాలకు ఎదురొడ్డి పోరాడి జైలుకు కూడా వెళ్లిన విషయాలను గుర్తు చేసుకుంటూ ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాల విషయంలో కూడా పోరాటాలు చేయడానికి వెనకాడేది లేదని తెలిపారు. సెక్రటేరియట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గిరి శ్రీనివాస్ రెడ్డి గారు కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడుతూ ఇందిరా పార్క్ దగ్గర ఏ విధంగా అయితే ధర్నా చౌక్ ఉండేదో సచివాలయంలో కూడా తెలంగాణ ఉద్యమ ధర్నా చౌక్ ఉండేదాని, సచివాలయ ఉద్యోగులు అందరం తెగించి కొట్లాడామని అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అందరూ ఉద్యోగులు, ఆఫీసర్లు ఎన్జీవోలు, క్లాస్ ఫోర్ ఉద్యోగులు, తెలంగాణ ఉద్యమ జేఏసీగా ఏర్పడి పోరాటం చేసిన తీరును వివరించి తెలంగాణ ఉద్యోగులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వంతో చర్చించి సామరస్యంతో సాధించుకుంటమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సచివాలయ కళాకారులు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసే పాటలతో అలరించారు.

# బిజినెస్

## రెండోరోజూ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..!

### అమ్మకాల ఒత్తిడితో డౌన్..!



జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
వారంలో రెండోరోజైన మంగళవారం స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. గ్లోబల్ మార్కెట్‌లో సానుకూల ప్రవనాలతో మార్కెట్లు లాభాల్లో మొదలయ్యాయి. ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. రియాల్టీ మినహా అన్నిరంగాల్లో అమ్మకాలు కనిపించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 81,492.50 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే సూచీలు నష్టాల్లోకి జారుకుతున్నాయి. ఇంట్రాడేలో 81,774.23 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,575.09 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. చివరగా 636.24 పాయింట్లు పతనమై.. 80,737.51 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 174.10 పాయింట్ల నష్టంతో 24,542.50 పాయింట్ల వద్ద ముగిసింది. మార్కెట్‌లో దాదాపు 1,701 షేర్లు లాభపడగా.. 2,148 షేర్లు పతనమయ్యాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం తగ్గింది. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగిసింది. రియాల్టీ ఇండెక్స్ ఒకశాతం పెరిగింది.బ్యాంక్, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ప్రైవేట్ బ్యాంక్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు 0.5-1 శాతం తగ్గాయి. నిఫ్టీలో అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, కోల్ ఇండియా, పవర్ గ్రిడ్ నష్టపోగా.. గ్రాసిమ్ ఇండస్ట్రీస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎం అండ్ ఎం, బజాజ్ ఆటో, సిప్లా లాభపడ్డాయి. ఇదిలా ఉండగా.. నిఫ్టీ బ్యాంక్ ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి 56,161 పాయింట్లను తాకింది. మరో వైపు మంగళశారం ఆసియా మార్కెట్లు లాభపడ్డాయి. బీఎస్‌ఈలో 100కి పైగా స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయికి చేరాయి. ఇందులో గార్డెన్ రీచ్, రాడికో ఖైతాన్, దీపక్ ఫెర్టిలర్స్, ఆథమ్ ఇన్వెస్ట్‌మెంట్, సోలార్ ఇండస్ట్రీస్, భారతి హెక్సాకామ్, సిటీ యూనియన్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, ఇంటెలెక్ట్ డిజైన్, ఇండియన్ బ్యాంక్ ఉన్నాయి. ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్ షేర్లు ఐపీఓ ధర కంటే 19శాతం ప్రీమియంతో లిస్టింగ్ అయ్యాయి. బీఎస్‌ఈలో 20.05 శాతం పెరిగి రూ.126.05 వద్ద ముగిశాయి.

## మైక్రోసాఫ్ట్‌లో మరో రౌండ్ లేఆఫ్‌లు.. 300 మంది తొలగింపు


జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగులకు షాకిచ్చింది. దాదాపు 300 మందికిపైగా ఉద్యోగులకు లేఆఫ్స్‌ప్రకటించింది. తాజా తొలగింపులు వాషింగ్టన్ కార్యాలయం నుంచి ఉన్నట్లు తెలుస్తోంది. తాజా కోతలు సంస్థలోని మొత్తం సిబ్బందిలో 1 శాతం కంటే తక్కువ అని ది సియాటిల్ టైమ్స్ నివేదిక తెలిపింది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తున్నాం' అని మైక్రోసాఫ్ట్ తన అధికారిక ప్రకటనలో తెలిపింది. తాజా రౌండ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రాడక్ట్ మేనేజర్లు ఎక్కువగా ఎఫెక్ట్ అయినట్లు సమాచారం.కాగా, మైక్రోసాఫ్ట్ గత నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి



లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరిలో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే.

## భారీగా పెరిగిన బంగారం ధరలు.. తులం ఎంతంటే..!

జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
బంగారం ధరలు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. ఇటీవల లక్ష రూపాయలకుపైగా చేరిన తులం బంగారం ధర.. తర్వాత క్రమంగా దిగి వచ్చింది. ఒక్కసారిగా రూ.95 వేలకు దిగువన వచ్చింది. ఆ తర్వాత మెల్లమెల్లగా పెరుగుతూ వస్తోంది. ప్రస్తుతం మళ్లీ ఎగబాకుతోంది. మంగళవారం (జూన్ 3)న దేశీయంగా బంగారం ధర పెరిగింది. జూన్ 2న ధరలతో పోల్చుకుంటే తులంపై ఏకంగా 1500 వరకు పెరిగింది. ప్రస్తుతం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.98,850 ఉండగా, 94 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.90,610 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి విషయానికొస్తే కిలో ధర రూ.1,00,100 వద్ద ఉంది. ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగవచ్చు. ఈ ధరలు



అన్ని ప్రాంతాల్లో ఒకే విధంగా ఉండకపోవచ్చు. ఎందుకంటే ప్రాంతాలను బట్టి జీఎస్టీ ఇతర ఛార్జీల ఆధారంగా ధర ఉంటుందని గుర్తించుకోండి.ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.98,850 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.90,610 ఉంది.

-ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.99,000 ఉండగా, అదే 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.90,760 ఉంది.

-హైదరాబాద్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.98,850 ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.90,610 వద్ద కొనసాగుతోంది.

**బంగారం ధర ఎలా నిర్ణయించబడుతుంది?**
24 క్యారెట్ల బంగారం దాని స్వచ్ఛత కారణంగా ఎల్లప్పుడూ ప్రీమియం కొనుగోలుదారుల మొదటి ఎంపికగా నిలిచింది. మరోవైపు, 22 క్యారెట్ల బంగారం బలమైనదిగా, ఆభరణాలకు ఉత్తమమైనదిగా పరిగణిస్తారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలు, ప్రభుత్వ పన్నులు, రూపాయి విలువలో హెచ్చుతగ్గులు వంటి అనేక కారణాల వల్ల భారతదేశంలో బంగారం ధర మారుతుంది. బంగారం పెట్టుబడి సాధనం మాత్రమే కాదు, మన సంప్రదాయాలు, పండుగలలో కూడా ఒక ముఖ్యమైన భాగం. ముఖ్యంగా వివాహాలు, పండుగల సమయంలో దీని డిమాండ్ పెరుగుతుంది.

## ఐపీఎల్ ఛాంపియన్‌గా ఆర్సీబీ..

### భావోద్వేగానికి లోనైన కోహ్లీ..!


జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఐపీఎల్ చరిత్రలో కొత్త ఛాంపియన్ అవతరించింది. 18 ఏళ్లుగా ట్రోఫీ కోసం పడిగాపులు కాస్తున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలి టైటిల్‌ను గెలుపొందింది. ఆరంభ సీజన్ నుంచి ఆర్సీబీకి ఆడుతున్న విరాట్ కోహ్లీ ఇదే మొదటి ట్రోఫీ. దాంతో, అతడు భావోద్వేగానికి లోనయ్యాడు. ఈ లెజెండరీ ఆటగాడు ఉబికివస్తున్న కన్నీళ్లను దాచలేకపోయాడు.అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌పై 6 పరుగులతో బెంగళూరు విజయం సాధించగానే విరాట్ తనను తాను కంట్రోల్ చేసుకోలేకపోయాడు.పట్టలేనంత సంతోషంతో మైదానంలోనే కూలబడిపోయి.. ఈ నేలకు వందనం.. అంటూ నమస్కరించాడు. అనంతరం తన మాజీ సహచరుడు ఏబీ డివిలియర్స్‌ను హత్తుకున్న కోహ్లీ.. భార్య అనుష్క శర్మ కు బిగ్ హగ్ ఇచ్చి తన జట్టు విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నాడు. ఈ




విజయం నాకే కాదు అభిమానులకు, మా జట్టుకు ఎంతో ప్రత్యేకం. 18 ఏళ్ల మా కల సాకారమైంది. ఆర్సీబీ విజయం కోసం నేను చేయాల్సిందంతా చేశాను. ఇలాంటి రోజు వస్తుందని నేను అస్సలు ఊహించలేదు. హేజిల్‌వుడ్ చివరి బంతి వేశాక జట్టులోని ప్రతిఒక్కరం ఎంతో భావోద్వేగానికి లోనయ్యాం. ఆరంభ సీజన్ నుంచి నేను ఆర్సీబీకే ఆడుతున్నా. నా హృదయం ఎప్పుడూ బెంగళూరుతోనే ఉంటుంది. ఈరోజు రాత్రి నేను చిన్నపిల్లాడిలా హాయిగా నిద్రపోతాను' అని కోహ్లీ తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

**8 అర్ధ శతకాలతో..**
ఐపీఎల్ తొలి సీజన్ నుంచి కోహ్లీ ఆర్సీబీని అట్టిపెట్టుకొని ఉన్నాడు. ఫెయిల్యూర్ టీమ్ అనే ముద్ర పడినా సరే అతడు మాత్రం బెంగళూరును మాత్రం వీడలేదు. 2016లో కెప్టెన్‌గా జట్టును ఫైనల్‌కు తీసుకువెళ్లిన విరాట్.. టైటిల్ కరువు మాత్రం తీర్చలేకపోయాడు. 17వ సీజన్ ముందు కెప్టెన్సీ వదులుకున్న విరాట్.. ఒత్తిడి లేకుండా ఆడడం మొదలెట్టాడు. 18వ సీజన్లో 8 అర్ధ శతకాలతో ఆర్సీబీ విజయాల్లో కీలక పాత్ర పోషించిన అతడు.. ఫైనల్లోనూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఓవైపు వికెట్లు పడుతున్న 43 పరుగులతో జట్టు భారీ స్కోర్‌లో భాగయ్యాడీ రన్ మెషీన్. 191 రన్స్ ఛేదనలో పంజాబ్‌ను 184కే కట్టడి చేసిన ఆర్సీబీ తొలిసారి విజేతగా అవతరించింది.

## ప్రీ- క్వార్టర్స్‌లో సింధు, సాత్విక్ జోడీ.. ప్రణయ్ ఇంటికి




జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు శుభారంభం చేసింది. చిరకాల ప్రత్యర్థి నొజొమి ఒకుహర ను చిత్తుగా ఓడించి ప్రీ-క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి ద్వయం అదిరే ప్రదర్శనతో దూసుకెళ్లింది. అయితే.. ఫేవరెట్లుగా బరిలోకి దిగిన లక్ష్యసేన్, ప్రణయ్‌లు తీవ్రంగా నిరాశపరిచారు. పేలవ ప్రదర్శనతో ఇద్దరూ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు.ఈ మధ్యే మలేషియా, సింగపూర్ ఓపెన్‌లో విఫలమైన సింధు
ఇండోనేషియా ఓపెన్‌లో చెలరేగుతోంది. తొలి రౌండ్‌లోనూ కఠినమైన ప్రత్యర్థిని ఓడించింది ఒలింపిక్ విజేత. జపాన్‌కు చెందిన నొజోమి ఒకుహరపై ఉత్కంఠ పోరులో 22-20, 21-23, 21-15తో గెలుపొందింది. నేను ఈమధ్య కాలంలో తొలి రౌండ్‌లోనే ఓడిపోతున్నా. సో.. ఇలాంటి ఉత్కంఠ మ్యాచుల్లో గెలుపొందడం నా ఆత్మవిశ్వాసాన్ని పెంచేది అని సింధు తెలిపింది. 16వ రౌండ్‌లో భారత షట్లర్ ఆరో సీడ్ పోర్న్‌పవే చౌచ్‌వాంగ్ (థాయ్‌లాండ్)తో తలపడనుంది.పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ తేలిపోయాడు. స్థానిక ఆటగాడు అల్వి ఫర్హాన్ ధాటికి చేతులెత్తేశాడు. అనంతరం జరిగిన డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టిల జోడీ అదరగొట్టింది. ఇండోనేషియా జోడీ లియో రాలీ కర్నాండో, బగాస్ ని చిత్తు చేస్తూ ప్రీ- క్వార్టర్స్‌కు చేరుకుంది.

# స్పోర్ట్స్

## అర్ధ శతకాలతో రెచ్చిపోయిన కుర్రాళ్లు ..

### తొలి అనధికారిక టెస్టు డ్రా..!



జూన్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఇంగ్లండ్ గడ్డపై భారత కుర్రాళ్లు తమ తడాఖా చూపించారు. బౌలింగ్ దళం విఫలమైనా బ్యాటింగ్‌లో తమకు తిరుగులేదని చాటారు. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇంగ్లండ్ లయన్స్ బౌలర్లను ఉతికారేస్తూ అర్ధ శతకాలతో కదం తొక్కారు. ఏకంగా టాపార్డర్లోని నలుగురు హాఫ్ సెంచరీలతో రెచ్చిపోవడంతో ఇరుజట్ల మధ్య జరిగిన మొదటి అనధికారిక టెస్టు డ్రాగా ముగిసింది. 30 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్‌కు ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(64), అభిమన్యు ఈశ్వరన్(68)లు శుభారంభం ఇచ్చారు. ఈ ఇద్దరు త్వరగానే ఔటైనా.. నాలుగో రోజు ధ్రువ్ జురెల్(53 నాటౌట్), నితీశ్ రెడ్డి (52 నాటౌట్)లు అజేయంగా నిలవడంతో మ్యాచ్ ఫలితం తేలకుండా డ్రా అయింది.తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ చేసిన భారత్.. అనంతరం ఇంగ్లండ్ లయన్స్‌ను కట్టడి చేయడంలో విఫలమైంది. బౌలర్లు తేలిపోవడంతో లయన్స్ 587 పరుగులకు ఆలౌట్ అయింది. 30 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ నాలుగో రోజు 2 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. ఓపెనింగ్ జోడీ తొలి వికెట్‌కు 123 పరుగులతో గట్టి పునాది వేయగా.. కుర్రాళు ధ్రువ్ జురెల్(53 నాటౌట్), నితీశ్ రెడ్డి (52 నాటౌట్)లు ప్రత్యర్థి బౌలర్లను ఓ ఆట ఆడుకున్నారు. మూడో వికెట్‌కు వీళ్లిద్దరూ 81 రన్స్ జోడించి ఇంగ్లండ్ లయన్స్ బౌలర్లను విసిగించారు. దాంతో, మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇరుజట్ల మధ్య జూన్ 6న రెండో టెస్టు మొదలు కానుంది.